
హైదరాబాద్ వార్త


# వర్షపు నీటి సంరక్షణ సామాజిక బాధ్యత

**-భూగర్భ జలాల పరిరక్షణలో అందరూ భాగస్వామం కావాలి - జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్**



ఇంకుడు గుంతలో ఇసుక పోస్తున్న మంత్రి పొన్నం, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, ఎమ్మెల్యే అద్దంకి దయాకర్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, కలెక్టర్ ప్రియాంక ఆల తదితరులు

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** జిల్లాలో ప్రతి వర్షపు నీటి బొట్టును భూగర్భంలోకి ఇంకేలా, వర్షపు నీటి సంరక్షణను ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతగా స్వీకరించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. సైఫాబాద్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో ఏర్పాటు చేసిన వర్షపు నీటి రీచార్జ్ పిట్లను ప్రారంభించి, మొక్కలు నాటి, వర్షపు నీటి సంరక్షణ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాకతీయులు, నిజాం పాలనలో నిర్మించిన చెరువులు, కుంటలు వర్షపు నీటి సంరక్షణకు, భూగర్భ జలాల పునరుద్ధరణకు ఎంతటి ప్రాధాన్యం ఇచ్చారో చాటిచెబుతున్నాయని పేర్కొన్నారు. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ, విస్తృత కాంక్రీటీకరణ కారణంగా హైదరాబాద్‌లో సహజ భూగర్భ జలాల రీఛార్జ్ తగ్గిపోయిందని, అందువల్ల శాస్త్రీయ విధానంలో వర్షపు నీటి సంరక్షణ అత్యంత అవసరమని మంత్రి అన్నారు. ప్రస్తుతం కృష్ణా, గోదావరి, సింగూర్, మంజీరా, హిమాయత్ సాగర్ తదితర వనరుల నుంచి నగరానికి తాగునీరు సరఫరా అవుతున్నప్పటికీ, పెరుగుతున్న జనాభా, నీటి అవసరాల దృష్ట్యా స్థానికంగా వర్షపు నీటిని భూగర్భంలోకి చేర్చే చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, విద్యాసంస్థలు, వాణిజ్య సంస్థలు సమర్థవంతమైన వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసి, వాటిని సక్రమంగా నిర్వహించాలని అప్పుడే నీటి ఎద్దడి స్థాయి తగ్గుతుందని మంత్రి వివరించారు. జలమండలి మండలి ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ, సింగూర్, మంజీరా, కృష్ణా, గోదావరి జలాశయాల నుంచి వందల కిలోమీటర్ల దూరం నుంచి నీటిని ఎత్తిపోసి హైదరాబాద్‌కు తాగునీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో సింగూర్ జలాశయంలో సుమారు 80 రోజుల అవసరాలకు సరిపడా నీటి నిల్వ మాత్రమే ఉందని పేర్కొంటూ, భూగర్భ జలాల బలోపేతం అత్యవసరమన్నారు. "ఇంటింటా ఇంకుడు గుంత" కార్యక్రమంలో భాగంగా 99 రోజుల వర్షపు నీటి సంరక్షణ కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నామని తెలిపారు. నగరంలో గుర్తించిన 3,435 ఎండిపోయిన లేదా పనిచేయని బోర్లలో 700 బోర్లను ఇంజెక్షన్ వెల్స్‌గా మారుస్తుండగా, 268 పనులు పూర్తయ్యాయని, 143 పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. సుమారు 34 వేల గృహాలను సర్వే చేసి, 24,892 వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలను జల్ సంచయ్ జన భాగీదారి 2.0 పోర్టల్‌లో నమోదు చేశామని, సాంకేతిక సహాయంతో 104 కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, కార్పొరేషన్ చైర్మన్ శ్రీరామ్ చక్రవర్తి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కరుణసాగర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమతదితరులు పాల్గొన్నారు.

# అంతా మా ఇష్టం?

**-బడా మాల్స్‌లో వ్యాపారుల ఇష్టారాజ్యం..**
**-అడ్డగోలు ధరలతో వినియోగదారులకు కుచ్చుటోపి**
**-పట్టించుకోని తూనికలు కొలతలశాఖ అధికారులు**
**-స్టేటస్ సింబల్‌గా భావించి భరిస్తున్న జనం**
**-మోసపోతున్నామని తెలిసినా ప్రశ్నించడానికి వెనుకంజ**



**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** ఇటీవల కాలంలో యువత షాపింగ్ చేయడంగానీ తినుబండారాల కొనుగోలు గానీ మాల్స్, మల్టీప్లెక్స్‌లలో చేయడం ఒక స్టేటస్‌గా భావిస్తున్నారు. ఈక్రమంలోనే తినుబండారాలు, వస్తువులకు వ్యాపారులు నిర్ధారించిన ధరలను చెల్లిస్తున్నారు. స్టేటస్‌మార్క్‌గా మాల్స్ పేరొందడంతో అక్కడకు వచ్చేవారు ధరల విషయంలోనూ ప్రశ్నించడం లేదు. ఈనేపథ్యంలో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయిస్తున్నారు. చేసేది లేక వినియోగదారులు, కాస్తంత ఉల్లాసం కోసం వచ్చిన వారు ప్రశ్నించేందుకు వెనుకంజ వేస్తున్నారు. అయితే కొందరు మాత్రం నిర్వాహకులను ప్రశ్నించకుండా తూనికలు కొలతల అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.

ప్రపంచీకరణ నేపథ్యంలో జీవితం బిజీబిజీగా మారిపోయింది... బిజీ జీవితలో క్షణం ఎంతో విలువైనదిగా మారింది. నిమిషంలో ఏమైన జరగవచ్చు.. ఆనిమిషంలోనే వెళ్ళాల్సిన బస్సు అందకుండా పోతుంది. ఆలస్యం కారణంగా ట్రాఫిక్ జామ్‌లతో పరిస్థితులు గందరగోళంగా మారుతుంటాయి.. అందుకే నగరవాసులు ఏవైనా కొనుగోలు చేయాలన్నా.. కాస్తంత ఉల్లాసంగా గడపాలన్నా.. సెలవురోజులనే ఎంచుకుంటారు. అదికూడా అన్నీ ఒకే ప్రాంతంలో లభించే వెసులుబాటును కోరుకుంటారు. వారాంతంలో లభించే అవకాశాన్ని వీలైనంత వరకు సద్వినియోగం చేసుకోవాలని చూస్తుంటారు. ఈక్రమంలోనే అందుబాటులోకి వస్తున్న మాల్స్‌కు ఇటీవల ఆదరణ పెరిగిపోయింది. మాల్స్‌లో ఏర్పాటయ్యే షోరూమ్స్, రెస్టారెంట్లు, మల్టీఫ్లెక్‌లు, గేమింగ్ జోన్స్‌తో సయోభేదం లేకుండా అందరూ రోజంతా ఊరట పొందే అవకాశం కలుగుతుంది. అయితే ఇంతవరకు బాగానే ఉన్నా.. వస్తువులు తినబండారాలు. ఇతర సేవలపై వసూలు చేస్తున్న ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. విలాసానికి ప్రతీకగా హైక్‌చేస్తూ అందినంత దండుకోవడం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. హైఫైజోన్‌లుగా పరిస్థితులు రూపొందిచిన మాల్స్, మల్టీప్లెక్స్‌లు, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్‌సిటీ ప్రాంతాల్లో అనేకంగా ఉన్నాయి. వారు తాము తీసుకునే వస్తువులకు, ఆహార పదార్థాలకు నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తున్నా... వారిమోసాలను హైఫైగా భావించి వినియోగదారులు భరిస్తుండటం ఇప్పుడు నగరంలో హాట్‌టాఫిక్‌గా మారింది. తూనికలు కొలతల అధికారులు ఇటీవల షాపింగ్‌మాల్స్, మల్టీప్లెక్స్‌లలో దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్న సందర్భంలో పలు అంశాలు చర్చకు వస్తున్నాయి. బేకరీలో అమ్మే రూ.25 గల కూల్‌డ్రింక్‌కు మల్టీప్లెక్స్‌లో రూ.150 చెల్లించాల్సిన పరిస్థితికి కారణం ఏంటీ..? బయట దుకాణాల్లో 500లకు లభించే షర్టుకు మాల్స్‌లో రూ.2000వేలు ఎందుకు చెల్లించాల్సి వస్తుంది. అందులో కొనేవన్నీ బ్రాండెడ్ వేనా.. లేకా అందులో కొనడమే ఒక స్టేటస్‌హా అనే అం శాలను పలువురు వినియోగదారులు చర్చిస్తున్నారు.

**గడువు ముగిసినవే ఆఫర్ల రూపంలో..**

సగటు మనిషి జీవన ప్రయాణం పెరుగుతున్న నేపథ్యంలో నేడు ఎన్నోఉత్పత్తులు, సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ఆఫీస్‌బాయ్ నుండి ఆఫీసర్ వరకు ఆయా స్థానాలను బట్టి నాణ్యమైన వస్తు, సేవలు వాడేందుకు మొగ్గుచూపుతున్నారు. వినియోగదారుల అవసరాలను గుర్తించిన పలు షాపింగ్‌మాల్స్ ఇంటర్నేషనల్ బ్రాండ్ల పేరుతో మోసాలకు పాల్పడుతున్నాయి. అంతర్జాతీయ బ్రాండ్లపేరు తో వినియోగదారులకు నిలువునా దోచేస్తున్నారు. ప్రముఖ సంస్థలకు చెందిన లేబుల్స్, ప్యాకింగ్‌లతో మసిపూసి మారేడుకాయ చేస్తున్నాయి. ముఖ్యంగా బ్రాండ్లపేరుతో ఒరకమైన మోసమైతే.. ఆఫర్లపేరుతో కూడా నగరవాసుల జేబులకు చిల్లుపెడుతున్నారు. కొన్ని షాపింగ్ మాల్స్ ఆఫర్లు అనగానే అందరూ తక్కువ ధరలకే వస్తున్నాయనే భావనలో ఉంటున్నారు. ఆయా సంస్థలు గడువు ముగిసిన ఉత్పత్తులనే ఆఫర్లు ఇస్తుండటంతో కొందరు అమాయక వినియోగదారులు కొనుగోలు చేసి మోసపోతున్నారు.

**అధికారులకు ఒత్తిళ్లు..**

గత కొన్ని రోజుల క్రితం తూనికలు కొలతల అధికారులు మాల్స్, మల్టీప్లెక్స్‌లో దాడులు నిర్వ హిస్తు కేసులు నమోదు చేశారు. అయినా వారి లోమార్పు రావడంలేదు. ఎందుకంటే అవన్నీ రాజకీయ నాయకులు, వారీ బంధువులకు సం బంధించినవే కావడంతో అధికారులు కూడా చేతు లెత్తేస్తున్నారు. ఇటీవల ఓషాపింగ్‌మాల్‌పై రెండవసారి దాడులకు వెళ్లిన తూనికలు, కొలతల అధికారులకు ఓరాజకీయ నాయకుడి నుండి ఒత్తిళ్లు రావడంతో తూతూమంత్రంగానే దాడులు నిర్వహించి ఎలాంట కేసులు నమోదు చేయ కుండా వెనుదిరినట్లు సమాచారం. దీంతో బడాషాపింగ్ మాల్స్‌వైపు తనిఖీలకు వెళ్లాలంటే అధికారులు జంకుతున్నారు.

# రూ.2,586.67 కోట్లతో ఎంఎంసీ బడ్జెట్ అంచనా

**-స్టాండింగ్ కమిటీ సమావేశంలో 32 కీలక అజెండా అంశాలపై సమగ్ర చర్చ**



స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంఎంసీ స్పెషల్ ఆఫీసర్ జయేష్ రంజన్, కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్ తదితరులు

**హైదరాబాద్, జులై 25, ప్రభాతవార్త**

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) అభివృద్ధే లక్ష్యంగా కీలక అజెండా అంశాలపై స్టాండింగ్ కమిటీ సమావేశంలో సమగ్ర చర్చ జరిగింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఎంఎంసి బడ్జెట్ రూ.2,586.67 కోట్ల అంచనాలతో పాటు కీలక అభివృద్ధి ప్రతిపాదనలపై చర్చించారు. కార్పొరేషన్ పరిధిలో పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, ట్రాఫిక్ సదుపాయాలు, ఘన వ్యర్థాల నిర్వహణ, పారిశుద్ధం, పరిపాలనా అంశాలు తదితరాలకు సంబంధించిన మొత్తం 32 అజెండా అంశాలపై సమగ్రంగా చర్చించారు. శనివారం తార్నాకలోని ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఎంఎంసీ స్పెషల్ ఆఫీసర్ జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంఎంసీ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, జోనల్ కమిషనర్లు రాధికా గుప్తా, సంచిత్ గంగ్వార్, వికాస్ మహతో, అదనపు కమిషనర్లు సి.ఎన్. రఘుప్రసాద్, కె.వేణుగోపాల్, ఇన్‌చార్జి చీఫ్ ఇంజనీర్ బి.ఎల్.శ్రీనివాస్‌రావు, అదనపు సీసీపి రంజిత్ కుమార్, సెక్రటరీ రజిని, యూబీడీ డైరెక్టర్ సునంద, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, చీఫ్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వెంకటేశ్వర్ రెడ్డి, చీఫ్ ఫైనాన్షియల్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, సీనియర్ ఎంటమాలజిస్ట్ మాధవ రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు రోహిణి, ఎల్‌ఏఓ సరితతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో యాప్రాల్ ప్రాంతంలో నాగిరెడ్డి చెరువు-కాప్రా చెరువులను అనుసంధానించే స్టోర్మ్ వాటర్ డ్రెయిన్ పనులు, నాగోల్ సర్కిల్ పరిధిలోని వివిధ కాలనీల్లో సీసీ రోడ్లు, యూజీడీ పైప్‌లైన్లు, కౌకూర్‌లో బాక్స్ డ్రెయిన్, యాప్రాల్ జంక్షన్ అభివృద్ధి, ఆనంద్‌నగర్ జంక్షన్ వద్ద 4లేన్ ఫ్లైఓవర్, హస్తినాపురం-బీఎన్ రెడ్డినగర్-సాగర్ కాంప్లెక్స్ జంక్షన్ల మీదుగా 6లేన్ గ్రేడ్ సెపరేటర్ నిర్మాణ ప్రతిపాదనలపై చర్చించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో 30 మంది ఇంజినీర్ల సేవల వినియోగం, కారుణ్య నియామకాలు, స్వయం సహాయక సంఘాల మహిళలకు మూడు జోన్లలో గుర్తించిన ఆరు పార్కుల నిర్వహణ బాధ్యతలు అప్పగించే ప్రతిపాదన తదితర పరిపాలనా, సామాజిక అభివృద్ధి అంశాలపై సమావేశంలో చర్చించారు. స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) 2.0 కింద 500 టీపీడీ సామర్థ్యంతో వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్, 9 మిడ్‌సైజ్ ఎలక్ట్రిక్ మెకానికల్ రోడ్ స్వీపింగ్ మెషీన్లు, 7 సెకండరీ కలెక్షన్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు, పీర్జాదిగూడలో సమగ్ర ఘన వ్యర్థాల ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌తో పాటు ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు, శానిటరీ ల్యాండ్‌ఫిల్, 9 ప్రాంతాల్లో ఆస్పిరేషనల్ టాయిలెట్ల ఏర్పాటు వంటి కీలక ప్రతిపాదనలపై సమగ్రంగా చర్చించారు. కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, శాస్త్రీయ ఘన వ్యర్థాల నిర్వహణను బలోపేతం చేయడం, ట్రాఫిక్ సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారాలు చూపడం, పర్యావరణహిత పట్టణాభివృద్ధిని వేగవంతం చేయడం లక్ష్యంగా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు. ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో విలీనమైన కొన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించిన ప్రతిపాదనలు, ఎంఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏడాది కాలానికి 30 మంది ఇంజినీర్లను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించే ప్రతిపాదన, ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని నాగోల్, సరూర్‌నగర్, ఎల్‌బీనగర్, హయత్‌నగర్ సర్కిళ్లలో పనిచేస్తున్న 223 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను నిబంధనలకు అనుగుణంగా నిర్ణయించడం, పెంచేందుకు పరిపాలనా అనుమతి లభించింది.

# పుట్‌పాత్ ఆక్రమణలపై సిఎంసి కొరడా

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** ప్రజలకు అడ్డంకులు లేని పుట్‌పాత్‌లు, రహదారులు ప్రజా ప్రదేశాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న "వాక్ ఫ్రీ" కార్యక్రమం నిర్వహిస్తుంది. ఇందలో భాగంగా శనివారం ప్రత్యేక ఆక్రమణల తొలగింపు డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో 14 గుర్తించిన ప్రాంతాల్లో మొత్తం 18.8 కిలోమీటర్ల మేర చర్యలు చేపట్టి, 347 ఆక్రమణలను తొలగించారు. అందులో శేరిలింగంపల్లి జోన్‌మొత్తం 8.3 కిలో మీటర్ల పరిధిలో డ్రైవ్ నిర్వహించి 123 ఆక్రమణలను తొలగించారు. పటాన్‌చెర్వు 15, అమీన్‌పూర్ 27, మియాపూర్ 30, శేరిలింగంపల్లి 15, మాధాపూర్ 36, కూకట్‌పల్లి జోన్‌మొత్తం 3.5 కిలోమీటర్ల పరిధిలో 93 ఆక్రమణలను తొలగించారు. మాధాపూర్ 36, ఆల్విన్ కాలనీ 15, కూకట్‌పల్లి 20, మూసాపేట్ 22, కుత్బుల్లాపూర్‌జోన్‌మొత్తం 7.0 కిలోమీటర్ల పరిధిలో 167 ఆక్రమణలను తొలగించారు. చింతల్ 25, జీడిమెట్ల 28, కొంపల్లి 34, నిజాంపేట్ 34, దుండిగల్ 15, మేడ్చల్ 31, ఆక్రమణలు తొలగించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ కమిషనర్ మాట్లాడుతూ, సృజన మాట్లాడుతూ "వాక్ ఫ్రీ" కార్యక్రమం ద్వారా పాదచారులకు సురక్షితమైన, ఆక్రమణలులేని ఫుట్‌పాత్‌లు మరియు ప్రజా ప్రదేశాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఆక్రమణలను తొలగించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. పునరావృతమయ్యే ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

## బోనాల ఉత్సవాలకు భారీ బందోబస్తు : డిసిపి రక్షితా కృష్ణమూర్తి

**బేగంపేట జులై 25, ప్రభాతవార్త**

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి బోనాల జాతర ఉత్సవాలకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని సికింద్రాబాద్ డీసీపీ రక్షితా కృష్ణమూర్తి అన్నారు. శనివారం మహంకాళీ పోలీసుస్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డీసీపీ వివరాలను వెల్లడించారు. ఆగస్టు 2.3తేదీల్లో జరిగే ఈ ఉత్సవాలకు లక్షలాది గా భక్తులు తరలి వస్తారని, దానికి తగినట్లు పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు డీసీపీ తెలిపారు. భక్తుల సౌకర్యం కోసం ఆరు క్యూలైన్ల ద్వారా అమ్మ వారి దర్శనం కల్పిస్తున్నామన్నారు. బోనాలతో వచ్చే మహిళలకు అలాగే సాధారణ మహిళలకు ప్రత్యేక క్యూలైన్లు కేటాయించామని చెప్పారు. విఐపీ పాసుల విషయంలో దేవాదాయ శాఖ అధికారులతో చర్చించింది నిర్ణయం తీసుకుంటామన్నారు. మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక వేదికతో పాటు వారి సమన్వయం కోసం ఇన్స్‌పెక్టర్ స్థాయి అధికారిని నియమిస్తున్నట్లు డీసీపీ స్పష్టం చేసారు. జోగినుల దర్శనానికి ప్రత్యేక సమయం కేటాయించామని, పోలీసు శాఖ తో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కూడా సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఫలహారపు బండ్ల నిర్వహకులకు కూడా స్పష్టమైన సూచనలు జారీ చేసామన్నారు. ఈ సమావేశంలో అడిషినల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ శ్రీధర్, ఇన్స్‌పెక్టర్లు రవికుమార్, సురేష్ కుమార్, పాల్గొన్నారు.



100 సంవత్సరాల బాణసంచా వేడుక సందర్భంగా నెక్లెస్ రోడ్‌లో బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

# వయోవృద్ధుల పట్ల ప్రేమతో మెలగాలి

**-జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

**హైదరాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** వయోవృద్ధుల పట్ల ప్రేమతో మెలగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా అన్నారు. శనివారం జిల్లా వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వయోవృద్ధుల సంక్షేమ కమిటీ సభ్యుల సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధుల పోషణ, సంక్షేమం, రక్షణ తదితర అంశాలకు సంబంధించిన 2007 చట్టం ప్రభుత్వ ఉత్తర్వులపై సంబంధిత అధికారులతో కలిసి సమీక్షించారు. ఇటీవల అమల్లోకి వచ్చిన తల్లిదండ్రుల పోషణ బాధ్యత, పరిరక్షణ చట్టం-2026ను అమలుపై కూడా కలెక్టర్ సమీక్షించారు. ఈచట్టం కింద అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖలు సత్వరమే పరిశీలించి చట్ట నిబంధనలకు అనుగుణంగా ఆలస్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. వృద్ధుల పట్ల నిరక్ష్యం, వేధింపులు అలాగే ఆస్తి వివాదాలు తదితర సంక్షేమ సంబంధిత అంశాల్లో సకాలంలో జోక్యం చేసుకునే చర్యలపై కూడా సమావేశంలోచర్చించారు. వృద్ధులకు సకాలంలో సహాయం, రక్షణ న్యాయమందేలా చట్టంలోని నిబంధనలను అనుబంధ శాఖలు సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. అలాగే వృద్ధులకు చట్టపరమైన హక్కులు అందుబాటులో ఉన్న పరిష్కార మార్గాలు, కేసులపై సంప్రదించాల్సిన అధికారుల గురించి అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు ఆరు వందల కేసులను పరిష్కరించడం జరిగిందని అలాగే రాష్ట్ర స్థాయి అవార్డు కూడా పొందటం జరిగిందనికలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఏడి వికలాంగుల సంక్షేమ శాఖ రాజేందర్, ఏసిపి ఆంజనేయులు, డిఏఓ జ్యోతి, ఎన్జీ వోస్ నిర్వాహకులు అరుణ్ డేనియల్, రోజీ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## శ్రీవారి ఆలయంలో తొలి ఏకాదశి వైభవ శోభ



చిక్కడపల్లి శ్రీవారి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

**చిక్కడపల్లి, జూలై 25 ప్రభాతవార్త:** తొలి ఏకాదశి సందర్భంగా శనివారం చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక వంశీయుడు స్వర్గీయ జి . రాజేంద్రనాథ్ గౌడ్ కుమారుడు జి.శ్రీనాథ్ గౌడ్-కీర్తి దంపతులు, ,దేవస్థాన సహాయ కమీషనర్, కార్యనిర్వహణాధికారిణి సుశీల్ రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలి ఏకాదశి సందర్భంగా పెద్దసంఖ్యలో హాజరైన భక్తులకు స్వామివారి తీర్థ తీర్థప్రసాదాలను అందించారు.

# ఉప్పల్, వరంగల్ జాతీయ రహదారి పునః ప్రారంభం

**-రోడ్డుకు ఒక వైపు అనుమతి ...తప్పిన ట్రాఫిక్ ఇక్కట్లు**



ఉప్పల్ చౌరస్తాలో వరంగల్ రహదారి నుంచి వాహనాలు వెళుతున్న దృశ్యం.

**ఉప్పల్, జూలై 25 ప్రభాతవార్త** : ఉప్పల్ నుంచి వరంగల్ వైపు వెళ్లే ప్రధాన రహదారిని రెండు నెలల అనంతరం అధికారులు శనివారం పునః ప్రా రంభించారు. గత రెండు నెలల క్రితం ఉప్పల్ చౌరస్తాలో ఫ్లైఓవర్ పిల్లర్ల నిర్మాణం కోసం రోడ్డు మూసివేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి వరంగల్ జాతీయ రహదారి నుంచి వెళ్లే వాహనాలను అధికారులు ప్రత్యామ్నాయ మార్గాల మీదుగా మళ్లించారు. అయితే రెండు నెలల తర్వాత రోడ్డుకు ఒక వైపు పనులు పూర్తి చేసిన అధికారులు ప్రస్తుతం ఉప్పల్ నుంచి వరంగల్ వైపు వెళ్లే మార్గాన్ని మాత్రమే తెరిచారు. శుక్రవారం రాత్రి నుంచి ద్విచక్ర వాహనా లు, ఆటోలు, కార్ల రాకపోకలకు అనుమతి ఇవ్వగా, భారీ వాహనాలను సర్వే ఆఫ్ ఇండియా. లిటిల్ ఫ్లవర్ స్కూల్ రహదారి మీదుగా మళ్లించారు. దీంతో గత కొద్ది రోజులుగా ఇరుకు రోడ్లపై ప్రయాణించిన వాహనదారుల కష్టాలు కొంత మేరకు పరిష్కారం అయ్యాయి. రహదారి అందుబాటులోకి రావడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా పలువురు అధికారులతో కలిసి ఉప్పల్ చౌరస్తాను పరిశీలించి తగు సూచనలు చేశారు. ట్రాఫిక్ రద్దీ నివారణకు రోడ్డుకు ఒక వైపు పూర్తిగా వాహనాలను అనుమతించాలని నిర్ణంచారు.

**వరంగల్ వెళ్లే వాహనాలకు మాత్రమే అనుమతి :**

ఉప్పల్ చౌరస్తా మీదుగా వరంగల్‌కు వెళ్లే ద్విచక్ర వాహనా లు, ఆటోలు, కార్లకు మాత్రమే మొదట అనుతిస్తున్నారు. రోడ్డు పూర్తి స్థాయిలో నిర్మించిన తర్వాత సోమవారం నుంచి పూర్తి స్థాయిలో వాహనాలను అనుమతిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఉప్పల్ చౌరస్తాలో నిర్మిస్తున్న కారిడార్ పిల్లర్ల నిర్మాణం తుది దశకు చేరుకుంది. మరో రెండు ఫిల్లర్లు నిర్మిస్తే పూర్తి స్థాయిలో నిర్మాణాలు పూర్తవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారి పునః ప్రారంభంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పలుచోట్ల మంచినీటి సరఫరాకు అంతరాయం

**హైదరాబాద్, జులై 25, ప్రభాతవార్త**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) ఆధ్వర్యంలో ఉప్పల్ జంక్షన్ వద్ద నిర్మిస్తున్న గ్రేడ్ సెపరేటర్ (ఫ్లైఓవర్) పనులను వేగవంతం చేయడానికి, కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్టు ఫేజ్-2 రింగ్ మెయిన్-2కు చెందిన 1600 మి.మీ వ్యాసం గల ఎంఎస్ గ్రావిటీ మెయిన్ పైప్‌లైన్ పరిధిలో జంక్షన్ పనులు చేపడుతోంది. ఉప్పల్ జంక్షన్ నుంచి వరంగల్ హైవే వైపు రహదారి ఇప్పటికే మూసివేయబడిన నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించి, ఫ్లైఓవర్ పి15 ఫౌండేషన్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి ఈ పనులు అత్యవసరంగా చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 27వ తేదీ ఉదయం 10గంటల నుంచి 28వ తేదీ ఉదయం 10గంటల వరకు కేడబ్ల్యూఎస్‌పీ ఫేజ్-2 రింగ్ మెయిన్-2పై 24 గంటల పాటు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జలమండలి తెలిపింది.

**అంతరాయం ఏర్పడే ప్రాంతాలు:**

ఫతేనగర్, హస్మత్‌పేట్, ప్రకాశ్‌నగర్, నాచారం, హెచ్ఎంటీనగర్, బీరప్పగడ్డ, హబ్సిగూడ, రామంతాపూర్, వెంకటరెడ్డినగర్, ఉప్పల్, మేకలమండి, భోలక్‌పూర్ (పాక్షికంగా), పద్మారావునగర్, బన్సీలాల్‌పేట్, బౌద్ధనగర్, తార్నాక (పాక్షికంగా), సీతాఫల్‌మండి, మెట్టుగూడ, లాలాపేట్ (పాక్షికంగా), నార్త్ లాలాగూడ, అడ్డగుట్ట, బాలానగర్, సౌత్ సెంట్రల్ రైల్వే, ఎంఈఎస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు. నీటి సరఫరాలో అంతరాయం కలగనున్న ప్రాంతాల్లోని వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోగలరని జలమండలి విజ్ఞప్తి చేసింది. పనులు పూర్తైన అనంతరం పైప్‌లైన్‌ను పునరుద్ధరించి, దశలవారీగా నీటి సరఫరా పునఃప్రారంభించబడుతుందని పేర్కొంది.

## తొలి ఏకాదశి వేడుకల్లో కొలన్ హన్మంత్ రెడ్డి



నిజాంపేట్, జూలై 25, ప్రభాతవార్త

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని శ్రీనివాస నగర్‌లో గల శ్రీశ్రీశ్రీ శ్రీనివాస అభయ ఆంజనేయ స్వామి దేవస్థానం ఆవరణలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన కొలన్ హన్మంత్ రెడ్డి, నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో ఆనందంగా జీవించాలని స్వామివారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు బొమ్మ వెంకటేశ్వర రెడ్డి (తాతిరెడ్డి), వరగాని వాసు, కొలన్ జీవన్ రెడ్డి, మురళి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రావూరి మోజేశ్వరరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు, పాల్గొన్నారు.

## రెజ్లర్లకు అండగా ఉంటా: తలసాని శ్రీనివాస్ యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

సంజీవరెడ్డి నగర్, జూలై 25, ప్రభాతవార్త:

రెజ్లర్ల అభివృద్ధికి అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. శనివారం అమీర్‌పేట మున్సిపల్ స్టేడియంలో తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని 70 వ్యాయామశాలల నిర్వాహకులకు రెజ్లింగ్ మ్యాట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సుమారు 150 మంది రెజ్లర్లు వివిధ విభాగాల్లో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారని, వారికి అవసరమైన ట్రాక్‌సూట్లు, షూస్, రవాణా ఖర్చులను తన జీవితకాలం పాటు భరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కార్యక్రమానికి సహకరించిన దాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, దాతలు కొలన్ భూపాల్ రెడ్డి, మామిడి బాల్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ సింగ్, రంగనాథ్, రాజు, బీఆర్ఎస్ పద్మారావు నగర్ ఇన్‌చార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, అమీర్‌పేట అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, నామన సంతోష్, ప్రవీణ్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, కూతురు నర్సింహ, కట్టా బలరాం, రమేష్ గౌడ్, వనం శ్రీనివాస్, గోపీలాల్ చౌహాన్, హరిసింగ్ పాల్గొన్నారు.

## ఘనంగా క్రమశిక్షణ మండలి ప్రమాణ స్వీకారం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

జీడిమెట్ల, జూలై 25, ప్రభాతవార్త

ఎస్ఆర్ నాయక్‌నగర్‌లోని సత్యవాణి విద్యానికేతన్‌లో టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో ఇన్వెస్టిచర్ సెరిమనీ (క్రమశిక్షణ మండలి ప్రమాణ స్వీకారోత్సవం) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ సూర రవిచంద్రారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ధర్మ, శాంతి, ప్రేమ, సత్య అనే నాలుగు హౌస్‌లకు హౌస్ కెప్టెన్లు, హౌస్ టీచర్లను నియమించారు. అలాగే 7, 8, 9వ తరగతి విద్యార్థులు ఓటింగ్ ద్వారా ఎన్నుకున్న హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్, సీసీఏ కెప్టెన్లు, స్పోర్ట్స్ కెప్టెన్లు, క్రమశిక్షణ కెప్టెన్లు, సాంస్కృతిక కెప్టెన్లతో కూడిన స్కూల్ క్యాబినెట్‌కు ప్రమాణ స్వీకారం నిర్వహించి మార్చ్‌పాస్ట్ ద్వారా గౌరవ వందనం సమర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల పూర్వ విద్యార్థి, 2002 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ డి. ధన్‌సింగ్ విద్యార్థులకు స్లాష్‌లు, బ్యాడ్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలకు ముఖ్య అతిథిగా రావడం ఎంతో గర్వంగా ఉందని, విద్యార్థి దశలో స్పోర్ట్స్ కెప్టెన్‌గా పనిచేసిన అనుభవం తనకు నాయకత్వ లక్షణాలను పెంపొందించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం చేసిన స్కూల్ క్యాబినెట్ సభ్యులు, వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టీవీఆర్ కోటి రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ దీప్తి రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీకృష్ణ రెడ్డి అభినందించారు.

## పాతబస్తీలో భక్తిప్రపత్తులతో తొలి ఏకాదశి



కేశవగిరిపై లక్ష్మీచెన్నకేశవస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చాంద్రాయణగుట్ట, జూలై 25, ప్రభాతవార్త :

తెలుగు ప్రజల తొలి పండుగైన దేవశయన ఏకాదశి (తొలి ఏకాదశి)ని పాతనగర ప్రజలు శనివారం భక్తి ప్రపత్తులతో జరుపుకున్నారు. ఉపవాస దీక్షల్లో సమీపంలోని వైష్ణవాలయాలకు వెళ్ళి ఆ మహా విష్ణువును ఫలపుష్పాలతో సేవించారు. నైవేద్యాలను సమర్పించి కర్పూర నీరాజనిలిచ్చారు. చాంద్రాయణగుట్ట కేశవగిరిపై వెలసిన స్వయంభూః శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో తెల్లవారుజామున స్వామివార్లకు అభిషేకం, విశేష అలంకరణ, హారతి తదితర పూజలు చేశారు. ఆలయ మాజీ చైర్మన్ జుర్కి రాజేందర్ కుమార్, ప్రతినిధులు రవి రాహుల్, జె.రంజిత్ కుమార్, భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అదేవిధంగా గౌలిపురా శ్రీ కోదండరామస్వామి దేవాలయం, పూల్‌బాగ్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, డిఎల్ఆర్ఎల్ శ్రీ బాలాజీ దేవాలయం, వట్టేపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, శ్రీరాంనగర్ కాలనీలోని శ్రీ అయ్యప్పస్వామి దేవాలయం తదితర ఆలయాలలో సైతం భక్తులు పూజలు నిర్వహించారు. పలు చోట్ల విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.

## సినారె సాహిత్యం విశ్వవ్యాప్తం కావాలి: బండారు దత్తాత్రేయ



ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డికి సాహితీ పురస్కారం ప్రదానం చేస్తున్న బండారు దత్తాత్రేయ

**చిక్కడపల్లి జులై 25, ప్రభాతవార్త :** పద్మభూషణ్ పురస్కార గ్రహీత, జ్ఞానపీఠ అవార్డు విజేత డాక్టర్ సి. నారాయణరెడ్డి సాహిత్యం విశ్వవ్యాప్తం కావాలని హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆకాంక్షించారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో సినారె 95వ జయంతి సందర్భంగా నిర్వహించిన సభలో ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డికి సాహితీ పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ, సినారె తెలుగు భాషను మాత్రమే కాకుండా విశ్వమానవతను ప్రతిబింబించే సాహిత్యాన్ని సృష్టించారని అన్నారు. కసిరెడ్డి వెంకటరెడ్డి ఉత్తమ సాహితీవేత్త, నీతి నిబద్ధత కలిగిన వక్తగా వేలాది మంది విద్యార్థులను తన ప్రసంగాలతో ఉత్తేజపరుస్తున్న దేశభక్తుడని కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ, సినారె వ్యక్తిత్వం ఆయన సాహిత్యం మాదిరిగానే ఉన్నతమైనదని పేర్కొన్నారు. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి జానపద సాహిత్యంపై విశేష పరిశోధనలు చేసి, అనేక గ్రంథాల ద్వారా ప్రజా సాహిత్యాన్ని పరిచయం చేశారని తెలిపారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ, సినారెపై కోట్లాది మందికి ఉన్న అభిమానమే ఆయన గొప్పతనానికి నిదర్శనమని, ఆయన జయంతిని ప్రభుత్వ పరంగా నిర్వహించాలని కోరారు. నిర్వాహక సంస్థ అధినేత, ప్రముఖ కవి డాక్టర్ ఎం.కె. రాము స్వాగతం పలికిన ఈ కార్యక్రమం లో ఆదాయపన్ను శాఖ విశ్రాంత సంచాలకుడు నరసిం హప్ప తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆశాల త వ్యాఖ్యానంలో డాక్టర్ రాము రచించిన "అదిగో ఆ మహాకవి నారాయణరెడ్డి" నృత్యరూపకం ప్రేక్షకులను ఆకట్టుకుంది.

## మొదటి తరం విద్యార్థి విద్య ,ప్రజాస్వామ్యంపై చర్చాగోష్టి



బి.ఆర్. అంబేద్కర్ విద్యాసంస్థలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ శాంతా సిన్హా

**చిక్కడపల్లి జులై 25, ప్రభాతవార్త :** విద్య ద్వారానే సమాజంలో సమాన అవకాశాలు, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక సమగ్రత బలపడతాయని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) మాజీ ఛైర్‌పర్సన్ డాక్టర్ శాంతా సిన్హా, ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకట్ రెడ్డి అభిప్రాయపడ్డారు. శనివారం బాగ్ లింగంపల్లి కాకా బి.ఆర్. అంబేద్కర్ విద్యాసంస్థ ఆధ్వర్యంలో "మొదటి తరం విద్యార్థి – విద్య ప్రజాస్వామ్యం" అనే అంశంపై ప్రత్యేక చర్చాగోష్టి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ శాంతా సిన్హా, వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మొదటి తరం విద్యార్థులు విద్యనభ్యసించే క్రమంలో ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రోత్సాహాన్ని అందించాలని సూచించారు. 1973లోనే సామాజిక న్యాయ సాధనకు విద్యనే మార్గమని నమ్మి, వెనుకబడిన వర్గాలకు నాణ్యమైన విద్యను చేరువ చేసేందుకు కాకా జి. వెంకటస్వామి అంబేద్కర్ విద్యాసంస్థలను స్థాపించారని వక్తలు స్మరించుకున్నారు. ఆయన ఆశయాలు నేటికీ సంస్థ నిర్వహణకు దిక్సూచిగా నిలుస్తున్నాయని అభినందించారు. మొదటి తరం విద్యార్థుల విద్యాబోధన అనేది విద్యార్థులు మరియు విద్యాసంస్థల మధ్య పరస్పర సహకారంతో సాగే ప్రక్రియ. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు మొదటి తరం పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలి. విద్యా అసమానతలను తగ్గిస్తూ సమగ్ర విద్యను అందించడంలో అంబేద్కర్ విద్యాసంస్థలు విశేష కృషి చేస్తున్నాయి. ఇదే విద్యాసంస్థలో ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసి, ప్రస్తుతం ఇక్కడే విధులు నిర్వర్తిస్తున్న పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు, సామాజిక సంస్థల ప్రతినిధులు మరియు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ కాకా బి.ఆర్. అంబేద్కర్ విద్యాసంస్థ యాజమాన్యం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది.

## జానపద కళాసంపదను విశ్వవ్యాప్తం చేయాలి : మంత్రి జూపల్లి కృష్ణారావు



యాదాద్రి జాతీయ నృత్యోత్సవ ప్రదర్శనల్లో ఒక దృశ్యం

**రవీంద్రభారతి, జూలై 25 ప్రభాతవార్త :** ప్రపంచంలోకెల్లా ప్రాముఖ్యతను సంతరించుకున్న భారతీయ శాస్త్రీయ, సంప్రదాయ, జానపద కళా సంపదను మరింతగా విశ్వవ్యాప్తం చేయాల్సిన అవసరం ఎంతో ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, ఏపి సాంస్కృతిక విభాగం, ఐసీసీఆర్, ఒడిస్సా సాంస్కృతికశాఖల సౌజన్యంతో ప్రముఖ సాంస్కృతిక సంస్థ కళాకృతి ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో రెండురోజులపాటు సాగే యాదాద్రి జాతీయ నృత్యోత్సవ వేడుకలు శనివారం రాత్రి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కృష్ణారావు విశిష్ట అతిథులు భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి, రక్షణ పరిశోధన అభివృద్ధి విభాగం మాజీ కార్యదర్శి డా. జి.సతీష్‌రెడ్డి, శాస్త్రవేత్త డా. బిశ్వజిత్‌చౌబే, నాట్యగురు డా. కళాకృష్ణ, సంస్థ డైరెక్టర్ భారతి తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి వేడుకలను ప్రారంభించి ప్రసంగించారు. శాస్త్రీయ నృత్యకళల్లో నాట్యగురువు భారతి అనేక మంది శిష్యులను తయారుచేయడం శ్లాఘనీయమని, సంస్థ జాతీయస్థాయిలో ప్రదర్శనలివ్వాలని సూచించారు. అనంతరం అతిథుల చేతులమీదుగా భరతనాట్య దిగ్గజం కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత, పద్మశ్రీ అవార్డు గ్రహీత గీతాచంద్రన్, ప్రఖ్యాత నాట్య గురువు ఉషాగాయత్రిలను ఘనంగా సత్కరించి యాదాద్రి జాతీయ ఎక్సలెన్సీ అవార్డు, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత వి.ఏ.కె.రంగారావును ఘనంగా సత్కరించి యాదాద్రి జీవిత సాఫల్య పురస్కారం, నీలబోసు సత్యం, హరిరెడ్డిలకు యాదాద్రి పురస్కారాలు, ఆరాధన, ఆనంద్ శంకర్‌లకు యాదాద్రి బాల పురస్కారాలను ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ నృత్యకారులు పలు అంశాలతో చేసి నాట్యవిన్యాసాలు సభికులను ఆసాంతం ఆకట్టుకుని తన్మయుల్ని చేశారు.

## ఇందిరమ్మ ఇండ్లను పేద ప్రజలకు ఉచితంగా ఇవ్వాలి

**: బిఆర్ఎస్ నాయకురాలు లిఖిత అమర్‌నాథ్‌గౌడ్**

హైదరాబాద్, జులై 25, ప్రభాతవార్త

హైదరాబాద్ నగరంలో ఇందిరమ్మ ఇండ్లను పేద ప్రజలకు ఉచితంగా ఇవ్వాలని నల్ల కుంట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు గంగిశెట్టి లిఖిత అమర్‌నాథ్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ పథకం ద్వారా లబ్ధిదారుడు రూ. 6 లక్షలు చెల్లించాలని, ఐదు లక్షలు సబ్సిడీ ఇస్తామని ప్రభుత్వం అంటుందని ఆమె పేర్కొన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని పేద ప్రజలు రూ. 6 లక్షలు ఎలా చెల్లిస్తారని ఆమె ప్రశ్నించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేదల కోసం లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 30 నెలలు గడుస్తున్నా హైదరాబాద్ నగరంలో ఒక్క ఇల్లు నిర్మించలేదని ఆమె ఆరోపించారు. తీరా ఇప్పుడు చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు లక్షలు లబ్ధిదారుడి నుండి తీసుకుని సింగిల్ బెడ్ రూమ్ ఇస్తామనడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వం పేదలకు ఇండ్లు కట్టిస్తే సంతోషమని, కానీ ఆ ఇండ్లను వారికి ఉచితంగా అందివ్వాలని లిఖిత గౌడ్ కోరారు. తిరిగి బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, పేదలకు ఉచితంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు అవుతాయని తెలిపారు.

## మేకప్‌మెన్ మృతికి కారణమైన ఇద్దరి అరెస్ట్

జూబ్లీహిల్స్, జూలై 25, ప్రభాతవార్తః

బంజారాహిల్స్ ఠాణా పరిధిలో జరిగిన ఒక సంఘటనలో మేకప్‌మెన్ మృతికి కారణమైన ఇద్దరు నిందితులను బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మేకప్‌మెన్‌గా పనిచేసే రవీంద్ర(35) భార్య ఆయేషాభాను జూనియర్ ఆర్టిస్ట్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 23న సాయంత్రం రవీంద్ర పని ఉందని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. తెల్లవారుజామున 2 గంటల సమయంలో శశి, వెంకట్ అనే ఇద్దరు యువకులు రవీంద్రను ఇంటి వద్దకు తీసుకొచ్చారు. మద్యం మత్తులో తమతో గొడవ పడ్డాడంటూ అక్కడే ఉన్న వాచ్‌మెన్ సిద్దులుకు చెప్పారు. వారిద్దరితో రవీంద్ర గొడవ పడటంతో అతన్ని అక్కడ నెట్టేసి వెళ్లిపోయారు. రవీంద్రను పరిశీలించిన 108 సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అనంతపురం జిల్లా ఒంటిమిద్దకు చెందిన ఎలుగు శశివెంకట్(18), విజయనగరంకు చెందిన ఉదరాల వెంకటేష్(18)లుగా గుర్తించి అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిసికి వినతి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కొంపల్లి, జూలై 25, ప్రభాతవార్త

కొంపల్లి సర్కిల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు ఎంటమాలజీ సిబ్బందిని పెంచి పారిశుధ్య నిర్వహణను మెరుగుపర్చాలని బీఆర్ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, ఎస్సార్ నాయక్ నగర్ మాజీ అధ్యక్షుడు ఆలూరు వెంకట శేషాచారి ఉప కమిషనర్ లావణ్యను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వర్షాకాలం నేపథ్యంలో దోమల వ్యాప్తి, అంటు వ్యాధుల నివారణకు ఎంటమాలజీ, పారిశుధ్య విభాగాల పనితీరును మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో సమర్పించిన వినతులకు సంబంధించిన పలు అభివృద్ధి పనులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వినతిపై స్పందించిన ఉప కమిషనర్ లావణ్య, ప్రస్తుతం ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతున్న కారణంగా కొంత జాప్యం జరిగిందని, త్వరలోనే పెండింగ్ పనులను పూర్తి చేయడంతో పాటు పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిషోర్, ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## అత్యాచారం కేసులో నిందితుడికి రిమాండ్

**అల్వాల్, జూలై 25 ప్రభాతవార్త:** మైనర్ బాలికపై అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడిని అల్వాల్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. 2024లో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సూర్యాపేట్ ప్రాంతానికి చెందిన పతనం కృష్ణ(30) కొంపల్లిలో నివాసం ఉంటూ అల్వాల్‌లోని ఓ స్వచ్ఛంద సంస్థలో క్యాబ్ డ్రైవర్‌గా పని చేసేవాడు. సదరు స్వచ్ఛంద సంస్థలో ఉన్న 15 ఏళ్ళ మైనర్ బాలికతో ఇతనికి పరిచయం ఏర్పడింది. జగద్గిరి గుట్టకు చెందిన బాలికకు మాయ మాటలు చెప్పి నిందితుడు లోబరుచుకుని అత్యాచారం చేయడం జరిగింది. బాలిక ఇటీవల బంధువులకు ఆత్యాచారం విషయం చెప్పడంతో వెలుగు లోకి వచ్చింది. జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ నిమిత్తం అల్వాల్ పోలీసులకు బదిలీ చేశారు. కేసును దర్యాప్తును ప్రారంభించిన స్థానిక పోలీసులు విచారణ అనంతరం కృష్ణను శనివారం రిమాండ్‌కు తరలించారు.

# నియోజకవర్గంలో అధ్వానంగా రోడ్లు

**-ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు**

**- ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆపాలి : బిజెపి**



**అత్తాపూర్ జూలై25,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో రోడ్ల అధ్వానంగా తయారైయ్యాయి. పట్టించుకోవాల్సి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ముఖ్యంగా గగన్‌పహాడ్, కాటేదాన్, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారాయి. ప్రతిరోజూ వేలాది మంది వాహనదారులు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో రహదారి మధ్యలోనే విద్యుత్ స్తంభాలు ఉండడం అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ పరిస్థితి కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

**ఫిర్యాదులు చేసిన దృష్టి సారించని అధికారులు**

రోడ్ల సమస్యలపై స్థానిక ప్రజలు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం కనిపించలేదని వాపోతున్నారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన అంశాల్లో నిర్లక్ష్యం ప్రదర్శించడం ఏమాత్రం సమంజసం కాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ,ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**ప్రధాన రహదారులను అత్యవసరంగా పునర్నిర్మించాలి**

**-బిజెపి డివిజన్ అధ్యక్షుడు సురెడ్డి వినయ్ రెడ్డి**

గగన్‌పహాడ్–కాటేదాన్–రాజేంద్రనగర్ ప్రధాన రహదారులను అత్యవసరంగా పునర్నిర్మించాలని రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ప్రమాదాలకు కారణమవుతున్న గుంతలను వెంటనే పూడ్చి, ప్రజలకు సురక్షితమైన రహదారులను అందుబాటులోకి తీసుకురావాలని మైలార్‌దేవ్‌పల్లి బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సురెడ్డి వినయ్ రెడ్డి డిమాండ్ చేశారు. అదేవిధంగా ముఖ్యంగా గగనపహాడ్ నుండి ఆరాంఘర్ వైపు వెళ్లే వాహనదారులు ఫుల్ ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు పడుతున్నారని పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

## సెల్ ఫోన్‌ల దొంగతనాల ముఠా అరెస్ట్.. 8 సెల్ ఫోన్లు స్వాధీనం



సెల్ ఫోన్‌ల దొంగతనాల ముఠా వివరాలను వెల్లడిస్తున్న కుల్సుంపుర ఏసిపి తిరుపతి.

**మెహిదీపట్నం, జులై 25, ప్రభాతవార్త :** మొబైల్ ఫోన్‌ల దొంగతనాలకు పాల్పడుతున్నఐదుగురు ముఠాను అరెస్ట్ చేసి వారి వద్ద ఎనిమిది మొబైల్ ఫోన్‌లతో పాటు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న ఘటన గుడి మల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కుల్సుంపుర ఏసీపీ తిరుపతి, ఇన్స్పెక్టర్ రామయ్యతో కలిసి శనివారం వివరాలను వెల్లడించారు. జులై 19 తెల్లవారుజామున సుమారు 3:00 గంటల ప్రాంతంలో ఆటో డ్రైవర్ అమిత్ జాదవ్ తన ఆటోను పిల్లర్ నంబర్ 104 వద్ద నిలిపి పక్కకు వెళ్లాడు. ఆ సమయంలో రెండు బైక్‌లపై వచ్చిన నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు ఆటోలోని ఆయన రెడ్‌మీ 15 ఫోన్‌ను దొంగిలించారు. బాధితుడు అడ్డుకోవడానికి యత్నించగా కత్తితో బెదిరించి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంబించారు. పోలీసులు రంగంలోకి దిగి సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దొంగతనానికి పాల్పడిన ఇస్మాయిల్ అయాన్ (20), మహమ్మద్ అమర్ బిన్ అస్ఫర్ (18), మహమ్మద్ అబూబకర్ బిన్ అయూబ్(22), మహమ్మద్ రమీజ్ రజా అలియాస్ సోహైల్ (22), మహమ్మద్ కాశిఫ్ (26)ను రేతీబౌలి ఎక్స్ రోడ్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఎనిమిది మొబైల్ ఫోన్లతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా మరో ముగ్గురు ఇమ్రాన్, అబ్దుల్ మాలిక్, ఇమ్రాన్ అలియాస్ సల్మాన్, షరీఫ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సులభంగా డబ్బులు సంపాదించేందుకు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో నిందితులు ఒప్పుకున్నట్లు, పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఏసిపి తెలిపారు.

## అభివృద్ధి పనులు పూర్తి చేయాలని వినతి



జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న శంకర్ నాయక్

దుండిగల్, జూలై 25, ప్రభాతవార్త

దుండిగల్ సర్కిల్ పరిధిలోని తాండ-2లో నిలిచిపోయిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ తాండ-2లో డ్రైనేజీ పనులు పూర్తయినప్పటికీ రోడ్ల నిర్మాణం ఇప్పటికీ చేపట్టకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తాండ నుంచి బయటకు వెళ్లేందుకు ప్రస్తుతం ఒకే రహదారి ఉండటంతో రాకపోకలు కష్టసాధ్యంగా మారాయని పేర్కొన్నారు. తాండ-2 నుంచి హెచ్ఎంటీ సొసైటీ మీదుగా తాండ-1 వరకు ఉన్న సర్వీస్ రోడ్డు వరకు కొత్త రహదారిని మంజూరు చేయాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. తాను కౌన్సిలర్‌గా ఉన్న సమయంలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.1.80 కోట్ల విలువైన పనులకు మున్సిపల్ తీర్మానం జరిగినప్పటికీ, ప్రభుత్వం మారిన తర్వాత అవి రద్దయ్యాయని గుర్తు చేశారు. డ్రైనేజీ పనులు పూర్తైన వెంటనే రోడ్ల నిర్మాణం చేపట్టి తాండ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని రాతపూర్వకంగా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రవీందర్ నాయక్, అమర్ సింగ్ నాయక్, హెచ్ఎంటీ సొసైటీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న డాక్టర్ ముజీబ్‌హుసేనీ

**బేగంబజార్, జూలై 25ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రిజిస్ట్రేషన్‌శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ నాన్ గజిటెడ్ కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. ముజీబ్‌హుస్సేనీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి రిజిస్ట్రేషన్‌శాఖ ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేడ్-2సబ్ రిజిస్ట్రార్లకు పదోన్నతులు కల్పించాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సేవలను కొనసాగించాలని, అలాగే సాధారణ బదిలీలను వెంటనే నిర్వహించాలని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. అందుకు పలు అంశాలపై సానుకూలంగా స్పందించి, వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని హామి ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌జిఓ ప్రతినిధులు ఎం.ఎ ముఖీమ్ తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలుడితో పని చేయించిన యజమానిపై కేసు

**నాచారం, జులై 25 ప్రభాతవార్త :** మైనర్ బాలుడితో పని చేయించిన యజమానిపై కేసు నమోదు చేసిన సంఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం. ఆపరేషన్ ముస్కాన్-12లో భాగంగా శనివారం నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో మల్లాపూర్ న్యూ నరసింహనగర్‌లోని ఓ చికెన్ సెంటర్‌లో 14 ఏళ్ల మైనర్ బాలుడు హెల్పర్‌గా పని చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కమ్యూనిటీ సోషల్ వర్కర్ నిట్టా పద్మ ఫిర్యాదు మేరకు, బాలుడిని చట్టవిరుద్ధంగా పనిలో నియమించిన యజమాని జరిపోతుల కిషోర్‌పై నాచారం పోలీసులు కేసు నమోదు చేశారు. మైనర్ బాలుడిని పనిలో నియమించడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ సంబంధిత యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఈ ఘటనపై దర్యాప్తు అధికారి వై. ఫ్రాన్సిస్ దర్యాప్తు చేపట్టారు.

## విఠలేశ్వర ఆలయ సమీపంలో అక్రమణలను తొలగింపు



అక్రమణలను తొలగిస్తున్న జిహెచ్ఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులు

**గోషామహల్, జూలై 25ప్రభాతవార్త:** గౌలిగూడలోని జంగల్ విఠోబా ఆలయ సమీపంలో అక్రమణలనుజిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు, పోలీసు బందో సహకారంతో అక్రమణలను తొలగించారు. ఈ మేరకు ఆలయ కమిటి ప్రతినిధులు జిహెచ్ఎంసి కమీషనర్ ఆర్వీ కర్ణన్ జిహెచ్ఎంసిగోషామహల్ డిప్యూటి కమీషనర్‌లను కలిసి ఆలయ సమీపంలో ఇంటిని ఖరీదు చేసిన ఓ వ్యక్తి, రోడ్డును, అక్రమించి, అక్రమంగా షెడ్ నిర్మించారని, వెంటనే అక్రమంగా వేసి షెడ్డును తొలగించాలని కోరుతూ వినతిపత్రంసమర్పించారు. దీంతో స్పందించిఇన జిహెచ్ఎంసి టౌన్‌ప్లానింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, అఫ్జల్ గంజ్‌పోలీసుల బందోబస్తు మధ్య విఠోబా ఆలయ సమీపంలో రోడ్డుకు అక్రమించి నిర్మించిన రేకుల షెడ్డునుజెసిబి సహాయంతో నేలమట్టం చేశారు. విషయం తెలుసుకున్న సదరు ఇంటి యాజమాని, అతని కుమారుడుతో బంధువులు పెద్ద ఎత్తున్న అక్కడికి చేరుకున్నారు. పోలీసులు నచ్చచెప్పడంతో పరిస్థితిసద్దుమణిగింది. ప్రభుత్వ ఆస్తులు, ప్రజల సౌకర్యార్థం కోసం ఏర్పాటు చేసిన రోడ్లు, ఫుట్‌పాత్‌లను అక్రమిస్తే తొలగిస్తామని డిప్యూటి కమీషనర్ ఉమాప్రకాష్ హెచ్చరించారు.

## మసాజ్ సెంటర్‌లో అసాంఘిక కార్యకలాపాలు

**-ఇరువురు వ్యక్తుల అరెస్టు**

వనస్థలిపురం జూలై25,ప్రభాతవార్త

ఎలాంటి అనుమతులు లేకుండా స్పా సెంటర్ ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్పా యజమాని, మేనేజర్ లను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓంకార్ నగర్ లో రిలైట్ వెల్ బ్యూటీ అండ్ స్పా సెంటర్ లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మసాజ్ సెంటర్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని సమాచారం అందుకున్న వనస్థలిపురం ఎస్.ఐ. గిరీష్ కుమార్ శుక్రవారం సిబ్బంది తో కలిసి రిలైట్ వెల్ బ్యూటీ అండ్ స్పా సెంటర్ కు వెళ్లి పరిశీలించారు. ఆ సమయంలో ఓ మహిళా తెరపిస్టు స్పా కు వచ్చిన వ్యక్తి కి క్రాస్ మసాజ్ చేస్తున్నట్లు గమనించారు. దీంతో స్పా సెంటర్ మేనేజర్ సాయి సంతోష్, స్పా యజమాని శివదుర్గ లను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రెండు పోక్సో కేసులు, చోరీ కేసుల్లో నిందితుడు

**- బంజారాహిల్స్ ఠాణాలో కేసు నమోదు**

జూబ్లీహిల్స్, జూలై 25, ప్రభాతవార్తః

జూబ్లీహిల్స్‌లో రిచ్‌కిడ్స్ సెక్స్‌ట్రాప్ వ్యవహారాన్ని మరిచిపోకముందే బంజారాహిల్స్‌లో మరో సెక్స్‌ట్రాప్ వ్యవహారం వెలుగుచూసింది.. వలపు వల విసిరి బాలికలపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అవసరం తీరాక ముఖం చాటేశాడు. దీనికితోడు మరో రెండు దొంగతనం కేసుల్లోనూ ఇతను నిందితుడిగా ఉన్నాడు. బంజారాహిల్స్ పోలీసుల అదుపులో ఉన్న నిందితుడికి సంబంధించిన వివరాల్లోకి వెళితే.. ఫిల్మ్‌నగర్‌లోని గౌతం నగరంలో నివసించే పవన్ అలియాస్ తరుణ్(22)కు కొన్ని నెలల క్రితం బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన ఒక బాలిక(17) ఇన్‌స్టా ద్వారా పరిచయమైంది. స్నేహం ముసుగులో బాలికపై లైంగికదాడికి పాల్పడి ఆమె వద్ద రెండు తులాల బంగారు ఆభరణాలు తీసుకొని ముఖం చాటేశాడు. ఫిబ్రవరిలో బాధిత బాలిక తల్లి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు అతని కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలోనే జడ్చర్లలో మరో యువతిని మూడు నెలల క్రితం పెళ్లి చేసుకొన్నట్లు అతని స్నేహితుడు ఇన్‌స్టాలో పెట్టిన ఫొటో ద్వారా పోలీసులు గుర్తించి శుక్రవారం అదుపులోకి తీసుకొన్నారు. ఈ క్రమంలోనే నిందితుడి లీలలన్నీ ఒకొక్కటిగా బయటపడుతున్నాయి. ఇందులో భాగంగానే డిసెంబరులో జూబ్లీహిల్స్ ఠాణాలో మైనర్‌పై లైంగిక దాడి కేసులో ఇతను అరెస్ట్ అయ్యి జైలుకు వెళ్లివచ్చినట్లు గుర్తించారు. అలాగే ఉప్పల్ ఠాణా పరిధిలో బైకు చోరీ, అదే ప్రాంతంలో సెల్‌ఫోన్ స్నాచింగ్ కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇన్‌స్టా ద్వారా యువతులకు వలవేసి బంగారు ఆభరణాలతో ఉడాయించడం అలవాటుగా చేసుకున్నాడని, మరో యువతి ఇలానే మోసపోయినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఒకటి, రెండు రోజుల్లో పోలీసులు కేసు వివరాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

### దర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయం : హరిసింగ్ నాయక్

**హయత్ నగర్, జులై 25 ప్రభాతవార్త :** నీట్ పేపర్ లికేజికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి దర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థుల విజయమని సీపీఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అన్నారు. విద్యార్థులు తమ పోరాటంతో కేంద్రం మెడలు వంచారన న్నారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా పరీక్ష రాసిన విద్యార్థులు కొంత మంది చనిపోవడం, అనేక మంది విద్యార్థులు నష్టపోవడం జరిగిం దన్నారు. లికేజికి భాద్యత వహిస్తూ విద్యశాఖ మంత్రి దర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనీ సోనాం వాంగ్ చుంగ్ కొనసాగించిన ఆమరణ నిరాహార దీక్ష, విద్యార్థుల పార్లమెంట్ ర్యాలీ మొత్తం దేశాన్ని కదిలించిందన్నారు. విద్యార్థుల పోరాటం ముందు ఎంతటి నియంతలు అయినా తల వంచల్సిందే అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి విద్యా రంగంలో సవరణలు చేసి మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

### హరిహర క్షేత్రంలో భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పర్వదిన వేడుకలు



దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు మంగళగిరి శ్రీనివాసాచార్యులు తదితరులు

**మలక్ పేట, జులై 25, ప్రభాతవార్త:** మలక్ పేట లోని శ్రీ హరిహర క్షేత్రం ఆలయం లో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దేవాలయానికి విచ్చేసి పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ట్రస్ట్ చైర్మన్ సుగురు రమేష్, ఆలయ ఇఓ మార్తాండ రావు, కమిటీ సభ్యులు శెట్టి విజయకుమార్, సరాపు శ్రీహరి, వనం సత్యేందర్, రొద్ద రమేష్, రేణు అగర్వాల్, పారిజాత రెడ్డి, ఆలయ అర్చకులు కాసుల చంద్రశేఖర్ శర్మ, మంగళగిరి శ్రీనివాసచార్యులు, మధు శర్మ తదితరులు పాల్గొన్నారు.

## సంఘ విద్రోహ శక్తులపై ప్రత్యేక నిఘా



చాదర్ ఘాట్‌లో కాలినడకన గస్తీ నిర్వహిస్తున్న ఎస్ఐ ఎలా కృష్ణ, సిబ్బంది తదితరులు

**మలక్ పేట, జులై 25,ప్రభాతవార్త:** సంఘ విద్రోహ శక్తులపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నట్లుచాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి పేర్కొన్నారు. ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి ఆధ్వర్యంలో చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కమల్‌నగర్, మూసా నగర్, వినాయక వీధి, అజంపురా ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా ప్రత్యక్ష గస్తీ, కాలినడక గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి మాట్లాడుతూ గస్తీలో భాగంగా హోటళ్లు, పాన్ షాపులు, ఇతర సున్నితమైన ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి అనుమానాస్పద వ్యక్తులను పరిశీలించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా తరచూ నేరాలకు పాల్పడే వ్యక్తులు, అనుమానాస్పద కదలికలు, సంఘవిద్రోహ శక్తులపై ప్రత్యేక నిఘా ఉంచామని వివరించారు.ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడంతో పాటు చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడమే ఈ గస్తీ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు, నిషేధిత వస్తువులు లేదా ఇతర అభ్యంతరకరమైన సామగ్రి లభించలేదని వెల్లడించారు. ప్రస్తుతం శాంతిభద్రతల పరిస్థితి ప్రశాంతంగా, అదుపులో ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎలా కృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పనిచేయాలి



రవికేశవ నాయుడుని సన్మానిస్తున్న మధుయాష్కిగౌడ్

**ఎల్.బి.నగర్, జులై 25 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నూతన అధ్యక్షులు కృషి చేయాలని ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మధుయాష్కిగౌడ్ పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో నూతనంగా కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులను నియమించిన సందర్భంగా వారికి ఆయన సత్కారం చేశారు. చైతన్యపురి డివిజన్ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన రవికేశవనాయుడుని ఆయన సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, కాంగ్రెస్ అభివృద్ధి, అభ్యున్నతి కోసం పటిష్టంగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ బి.విజయరంగా, శరత్‌చంద్ర, మధు, తిరుమల్‌రెడ్డి, సురేష్‌వర్మ, ప్రకాష్, భాస్కర్‌రెడ్డి, టింకు, కిషన్, నరేందర్‌రెడ్డి, రాహుల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## సర్‌కు అందరూ సహకరించాలి



సమావేశానికి హాజరైన వివిధ పార్టీల నాయకులు

**ఎల్.బి.నగర్, జులై 25 ప్రభాతవార్త:** కందుకూరు ఆర్డీవో, మహేశ్వరం నియోజకవర్గ ఎన్నికల ఇఆర్వో ఎన్.జగదీశ్వర్‌రెడ్డి సరూర్‌నగర్ సర్కిల్‌కి సంబంధించిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, బిఎల్ఎలు, కాలనీల అసోసియేషన్ ప్రతినిధులతో కొత్తపేటలోని బాబుజగ్జీవన్ రామ్ భవన్లో సర్ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ సరూర్నగర్ సర్కిల్లో ఇప్పటివరకు 33 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. చివరి తేదీ వరకు ఎదురు చూడకుండా అర్హులైన ఓటర్లందరూ తమ ఎన్యూమరేషన్ ఫారాలను పూరించి బిఎల్ఓలకు వెంటనే అందించాలన్నారు. ఆగస్టు మూడో తేదీ చివరి తేదీ అని తెలిపారు. ఓటర్లకు ఫారాల అందించడం, ఇచ్చిన ఫారాలను నింపడం, ఫారాలను బిఎల్ఓలకు అందించడంలో బిఎల్ఎలు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బదిలీ చేసుకోవడం, రెండు ఓట్లు కలిగి ఉండడం, మరణించిన ఓటర్లను గుర్తించడంలో బిఎల్ఎలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సరూర్నగర్ సర్కిల్ ఏఈఆర్ఓ శ్రీనివాస్, మహేశ్వర నియోజకవర్గ ఎలక్షన్ డిప్యూటీ తాసిల్దార్ నరేష్, కాంగ్రెస్ బిజెపి ప్రతినిధులు పున్న గణేష్‌నేత, ఎం.శ్రీధర్‌రాజ్, లింగస్వామిగౌడ్, రమేష్‌నేత, రాములు యాదవ్, బిఎల్ఓ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## రెండు లక్షల ఉద్యోగాలు భర్తీచేయాలి : ఆర్.కృష్ణయ్య

**హుడాకాంప్లెక్స్,25 జులై, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం దిల్‌సుఖ్‌నగర్‌లో నిరుద్యోగ జేఏసీ అధ్వర్యంలో తలపెట్టిన ర్యాలీలో అయన పాల్గొని మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా అయన మట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి నిరుద్యోగ సమస్యే ప్రధాన కారణమన్నారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను నిర్లక్ష్యం చేసినందుకే వారి అగ్రహానికి గురై ఓటమి పాలైందన్నారు. రాహుల్‌గాంధీ, రేవత్‌రెడ్డి ప్రతి ఎన్నికల ప్రచారంలో ఉద్యోగాలు భర్తీ చేస్తామని విస్తృతప్రచారం చేసి నిరుద్యోగులను నమ్మించి, అధికారంలోకి రాగానే నిరుద్యోగులను పట్టించుకోకుండా వాగ్ధాలను తుంగలో తోక్కాసారని అరోపించారు. గతంలో ఉన్న ముఖ్యమంత్రులు విద్యార్థులు ధర్నాలు చేస్తే వెంటనే చర్చలకు పిలిచి మాట్లాడేవారని, ఇపుడు రోజు ధర్నాలు చేసిన పట్టించుకోవడంలేదంటే రేవంత్‌రెడ్డికి ముఖ్యమంత్రి పదవే ముఖ్యమనే అలోచనలో ఉన్నారని, ప్రజల అభిప్రాయాన్ని గౌరవాన్ని కాపాడుకోవటంలేదని అరోపించారు. నేను పట్టిన నకుందేలుకు మూడే కాళ్లనే ధోరణి మంచిదికాదని సూచించారు. రిటైర్‌మెంట్, ప్రమోషన్ల వలన ఖాళీయైన ఉద్యోగాలను భర్తీ చేయడంలేదన్నారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో 20వేల కానిస్టెబుల్, ఎస్ఐ తదితర పోస్టులు ఖళీగా ఉంటే కేవలం 7వేలకే నోటీఫికేషన్ జారీ చేశారని మొత్తం పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. టీచర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో పాఠశాలలో విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయన్నారు. యూనివర్‌సిటీల్లో ప్రొఫెసర్ పోస్టులు, 3వేల లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తీచేయటానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలకు, మండలాలకు మున్సిపాలిటీలకు అదనపు పోస్టులు మంజూరు చేయలేదని వాటిని వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జీఓ నెంబరు 46ను వెంటనే రద్దు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి నిరుద్యోగ సమస్య పరిష్కరించడానికి ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని కోరారు. ప్రైవేట్ రంగం ఐటీ తదితర ఉద్యోగాలతో పాటు ప్రభుత్వశాఖలలో ముఖ్యంగా విద్య, వైద్యం, రెవిన్యూ, పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగాలను పూర్తి స్థాయిలో భర్తీ చేయాలని అర్.కృష్ణయ్య కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, ఐఖ్య వేధిక అధ్యక్షుడు అనంతయ్య, విద్యార్థి సంఘం కన్వీనర్ పర్లగోర్ల మోడీరాందేవ్ యాదవ్, బీ.సీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.రాజేందర్, పృద్దిగౌడ్, శివకుమార్ యాదవ్, బలరాం, వంశీ, తెలంగాణ నిరుద్యోగ జేఏసి నాయకులు మోతీలాల్, నవీన్ పట్నాయక్, బాలకోటీ, అకిల్ తదితరులు పాల్గొన్నారు.




నిరుద్యోగ జేఏసి ర్యాలీలో పాలొన్న ఆర్.కృష్ణయ్య

## నియోజకవర్గంలో పెండింగ్ పనులు పూర్తి చేయండి : ఎమ్మెల్యే




సమస్యలను కమిషనర్‌కు విస్తరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**వనస్థలిపురం. జులై.25.ప్రభాతవార్త.** నియోజకవర్గ పరిధిలోని పలు ప్రధాన సమస్యల మీద మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణరెడ్డిని మర్యాదపూర్వకంగా ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు మరియు ప్రజా సమస్యలపై చర్చించి,త్వరితగతిన చర్యలు చేపట్టలని కోరారు.దానిలో భాగంగా గతంలో మేము తెలంగాణ చౌరస్తా వద్ద రోడ్డు వెడల్పు విషయంలో మేము మిమ్మల్ని కలవడం జరిగింది.మీరు వెంటనే స్పందించి అట్టి రోడ్డును పరిశీలించారు. .దానికి ధన్యవాదాలు.చంపాపేట్ డివిజన్ సుల్తాన్‌వాల్వ మినీ ఫంక్షన్ హాల్ పునరుద్ధరణ, సుల్తాన్ వాల్వ వీకర్ సెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్,షెడ్,మరుగుదొడ్లు మరియు బోర్‌వెల్ వంటి మోలిక సదుపాయాల పనులు. హయత్ నగర్ డివిజన్ పరిధిలోని మహా గాయత్రీ నగర్ సీ.సీ.రోడ్డు మరియు ఓపెన్ జిమ్ పనులు.హయత్ నగర్ డివిజన్ సాయి గార్డెన్ కాలనీ సీ.సీ.రోడ్డు నిర్మాణం పెండింగ్‌లో ఉంది.దీనికి తక్షణ మంజూరు మరియు నిర్మాణం అవసరం అని కోరారు. మన్సూరాబాద్ డివిజన్ పాత పోచంపల్లి రోడ్డు పునరుద్ధరణ, మహావీర్ హరిణీ వనస్థలి ద్వారా ఆక్రమణకు గురైనట్లుగా భావిస్తున్న మన్సూరాబాద్ - పాత పోచంపల్లి రోడ్డును తిరిగి స్వాధీనం చేసుకుని,పునరుద్ధరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ రోడ్డు దాదాపు 50 కాలనీలకు కీలక అనుసంధాన మార్గంగా ఉంది మరియు ఇది 100 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన పాత జిల్లా పరిషత్ రోడ్డు.ఇది గెజిట్‌లో కూడా నమోదై ఉంది. ఇది ఔటర్ రింగ్ రోడ్డు )కు ముఖ్యమైన అనుసంధానాన్ని కల్పిస్తుంది మరియు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కాబట్టి ఈ రోడ్డు పునరుద్ధరణను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని కోరారు. అదేవిధంగా మరిన్ని సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పరిష్కరించి పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయవలసిందిగా కోరారు.అనంతరం కమీషనర్ మాట్లాడుతూ రెండు,మూడు రోజుల్లో అధికారులచే సమావేశం ఏర్పాటు చేయించి త్వరితిగతిన పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ బారాస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద రెడ్డి, భాస్కర్ సాగర్,రవి ముదిరాజ్,గండికోట శ్రీనాద్ మరియు పలు కాలనీల అధ్యక్ష,కార్యవర్గ సభ్యులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ సర్కిల్ పరిధిలో ఘనంగా తొలి ఏకాదశి పూజలు

**ఉప్పల్, జులై 25 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిది లోని పలు ప్రాంతాల్లోని ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. సర్కిల్ పరిధిలోని ఉప్పల్, రామంతాపూర్, హబ్సిగూడ, చిలుకానగర్ తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. ఉప్పల్ శ్రీ కరిగిరి వెంకటేశ్వర స్వామి ఆలయంతోపాటు, శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం, వెలుగు గుట్ట ఆలయం, రామంతాపూర్‌లోని శ్రీ రమా సహిత సత్య నారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ కరిగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీతో ఆలయం కిటకిటలాడింది. కిలో మీటర్ల మేరకు భక్తులు బారులు తీరారు. ఆలయం వద్ద భక్తులకు ఏర్పాట్లు చేయడంలో నిర్వహకులు పూర్తిగా విఫలం అయ్యారు. భక్తుల తోపులాటతో ఇబ్బంది పడ్డారు.

**రామంతాపూర్‌లో.. :** రామంతాపూర్‌లోని శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి సందర్భంగా లక్షపుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ సభ్యుడు కోట్ల నర్సింహారెడ్డి, కార్యనిర్వహణాధికారి ఇ.ఎన్. విజయభారతి ఆధ్వర్యంలో ఏకాదశి పూజలు నిర్వహించారు. .హిందూ వైదిక సంప్రదాయంలో ఏకాదశికి విశిష్టమైన ప్రాధాన్యం ఉందని, సంవత్సరంలో వచ్చే 24 ఏకాదశుల్లో ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి, వైకుంఠ ఏకాదశి అత్యంత పవిత్రమైన పర్వదినాలుగా భావిస్తారని వారు పేర్కొన్నారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజున శ్రీమన్నారాయణుడు పాలకడలిలో ఆదిశేషునిపై శయనిస్తాడనే విశ్వాసంతో దీనిని శయన ఏకాదశిగా ఆచరిస్తారని తెలిపారు. ఇదే దక్షిణాయన ప్రారంభాన్ని సూచించే పవిత్రమైన సందర్భంగా భక్తులు విశేషంగా పూజలు నిర్వహించడం ఆనవాయితీ అని వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించే లక్షపుష్పార్చన, ప్రత్యేక అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పూజారులు మంగళ తిరుపతాచార్యులు, మంగళగిరి శ్రీనివాసాచార్యులు, శేషాచార్యులు, సీతారామాచార్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.



రామంతాపూర్‌లోని శ్రీ సత్యదేవుడి ఆలయంలో లక్ష పుష్పార్చన నిర్వహించిన దృశ్యం.

### రాజ్యాంగ పరిరక్షణలో న్యాయవాదుల పాత్ర కీలకం : సుప్రీం కోర్ట్ న్యాయవాది హనుమంతరావు

**ఎల్‌బి నగర్ జులై 25 ప్రభాతవార్త :** రాజ్యాంగ పరిరక్షణలో న్యాయవాదులు న్యాయ శాస్త్ర విద్యార్థుల పాత్ర చాలా కీలకము అని సుప్రీంకోర్టు న్యాయవాది చావా హనుమంతరావు పేర్కొన్నారు. ఎల్బీనగర్ చిత్ర లేఅవుట్ లోని మహాత్మా గాంధీ న్యాయ కళాశాలలో ఎల్ ఎల్ ఎం డిగ్రీ పొందిన విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే ను శనివారం కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హనుమంతరావు కళాశాల సెక్రెటరీ గంగుల గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగబద్ధ చట్టబద్ధ హక్కుల బాధ్యతల నిర్వహణలో న్యాయ శాస్త్ర విద్యార్థులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కక్షిదారుల హక్కుల పరిరక్షణలో న్యాయ శాస్త్ర విద్యార్థులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కళాశాల సెక్రటరీ గంగుల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి న్యాయ శాస్త్ర విద్యార్థి మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. తమ కళాశాల అభివృద్ధిలో తమ విద్యార్థులు అధ్యాపకులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసా పత్రాలు పథకాలను వారు అందజేశారు. కార్యక్రమంలో సాంస్కృతిక, నృత్య, సంగీత కార్యక్రమాలు ఆహుతులను అలరింపజేశాయి.



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న హనుమంతరావు, గంగుల గోవర్ధన్ రెడ్డి

## మోడీ ప్రభుత్వ అసమర్థతతోనే పేపర్ లీక్‌లు : మధుయాష్కి గౌడ్..

### ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ శ్రేణుల భారీ బైక్ ర్యాలీ

**మన్సూరాబాద్, జులై 25, ప్రభాతవార్త:** మోడీ ప్రభుత్వ హయంలో దేశంలో 152 సార్లు పేపర్ లీక్ సంఘటనలు జరిగినా . ఒక్కరికి శిక్ష పడకపోకపోవడం సిగ్గుచేటని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ గారు పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత ఆందోళనలకు మద్దతుగా నిరసన చేపట్టిన రాహుల్ గాంధీ పట్ల దురుసు ప్రవర్తన, అరెస్ట్ ను నిరసిస్తూ మధుయాష్కి నేతృత్వంలో ఎల్బీనగర్ లో కాంగ్రెస్ శ్రేణులు భారీ గా బైక్ ర్యాలీ నిర్వహించారు . ఈ సందర్భంగా శనివారం వనస్థలిపురంలోని సుష్మ చౌరస్తా నుంచి వనస్థలిపురం మీదుగా ఎల్బీనగర్లోని అంబేద్కర్ జగ్జీవన్ రామ్ విగ్రహాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వ అసమర్థతతోనే పేపర్ లీక్ లు జరుగుతున్నాయని విమర్శించారు. గతంలో పేపర్ లీక్ సంఘటనల్లో నిందితుల్లో ఉన్నవారికి క్లీన్ చిట్ ఇచ్చి వదిలేసారని విమర్శించారు. నీట్ పేపర్ లీక్ తో 22 లక్షల మంది విద్యార్థులు వారి కుటుంబాలు ఆవేదనకు లోనయ్యా అన్నారు, మనోవేదనతో పలువురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ఆ కుటుంబాలకు ఎవరు న్యాయం చేస్తారని ప్రశ్నించారు.కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడమే కాకుండా చనిపోయిన కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని, విద్యార్థులపై కేసులు ఉపసంహరించుకోవాల్సిందనని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా యాదవ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్ జీహెచ్ఎంసి మాజీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి పార్టీ జనరల్ సెక్రెటరీ పృధ్వి చౌదరి డివిజన్ అధ్యక్షులు శ్రీనాథ్, రమాకాంత్, కవిత, చెరుకు చిరంజీవి గౌడ్, గణేష్ రెడ్డి, రజిని రావు, చిన్నగోని రవీందర్ గౌడ్, సునీల్ బాబు, గంధం రవి కేశవ, బాబా యాదవ్, రమేష్ నాయక్, శ్రీధర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేల పాటి రామారావు, జిల్లా ఉపాధ్యక్షులు కొండోజు శ్రీనివాస్ , జనరల్ సెక్రెటరీ లు స్వర్ణ మాధవి, వినయ్ పాల్ రెడ్డి, స్పోక్స్ పర్సన్ దాము మహేందర్ యాదవ్ ,, కార్యదర్శి లతా గౌడ్ , నరేష్ గుప్తా, మాజీ అధ్యక్షులు మకుటం సదా శివుడు, కుట్ల నర్సింహా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్బీ నగర్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మధు యాష్కీ

### ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యం : సాయిజెన్ శేఖర్




సర్ కార్యక్రమంలో పాల్గొన్న సాయిజన్ శేఖం

**నాచారం, జులై 25 ప్రభాతవార్త :** ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు సాయిజెన్ శేఖర్ తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ, ఎన్యుమరేషన్ దరఖాస్తు ఫారాల ప్రాధాన్యాన్ని వివరిస్తూ ప్రత్యేకంగా ఆటోను ఏర్పాటు చేసి కాలనీలు, బస్తీల్లో మైక్ ద్వారా ప్రచారం చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచనల మేరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేసి దరఖాస్తు ఫారాలు నింపడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి సహాయం అందిస్తున్నామని తెలిపారు. 2002 ఓటరు జాబితాలో పేర్లను గుర్తించేందుకు కూడా అవసరమైన సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి అర్హుడైన ఓటరు తన ఓటు హక్కును పరిరక్షించుకునేలా అవగాహన కల్పించడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు విటల్ యాదవ్, వేముల మారయ్య, కట్ట బుచ్చన్నగౌడ్, చంద్రశేఖర్, పెంటయ్య, గణేష్, శ్రీనివాస్, నరసింహ, అశోక్, అరుణ పాల్గొన్నారు.

### ఎల్బీనగర్ కాంగ్రెస్ నాయకులు కొవ్వొత్తుల నిరసన




ఎల్బీ నగర్‌లో కాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు.

**మన్సూరాబాద్, జులై 25, ప్రభాతవార్త:** నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులు, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎల్బీనగర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీక్ కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుద్ద సత్యనారాయణ,పోచబోయిన సురేష్ యాదవ్, కూరెళ్ల వేములయ్య గౌడ్.., కడారి బాలకృష్ణ యాదవ్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఎస్ఐఆర్‌లో బిఎల్ఓ, బిఎల్ఎలకు సహకరించాలి



ఎస్ఐఆర్ కేంద్రంలో ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

**సరూర్‌నగర్, జులై 25 ప్రభాతవార్త:** నాదర్‌గుల్ డివిజన్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం కావడానికి ప్రతి ఒక్కరూ బిఎల్ఓ, బిఎల్ఎలకు సహకరించాలని డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి కోరారు. డివిజన్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సందర్భంగా ఆయన ఎస్ఐఆర్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేషన్ ఫారాలు పూరించని ఓటర్లకు ఫోన్ చేసి వారితో మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పోగొట్టుకోవద్దని గోవర్ధన్‌రెడ్డి సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలు పూరించి ఎస్ఐఆర్ కేంద్రాల్లో బిఎల్ఓలకు అందజేయాలని ఆయన తెలిపారు. పూరించంలో ఇబ్బంది ఉంటే బిఎల్ఓ, బిఎల్ఎల సాయం తీసుకోవాలని ఆయన సూచించారు.

### లాలాపేట్ యాదాద్రి వైన్స్‌లో ఘర్షణ..

### ముగ్గురికి గాయాలు

**తార్నాక, జులై 25 ప్రభాతవార్త :** లాలాపేటలోని యాదాద్రి వైన్స్‌లో జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలకు గురైన సంఘట లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్‌పెక్టర్ రవి కిరణ్ కథనం ప్రకారం.. శుక్రవారం రాత్రి లాలాపేట్ హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద ఉన్న యాదాద్రి వైన్స్‌లో ఫిర్యాదుదారు తన స్నేహితులతో కలిసి మద్యం సేవిస్తున్నాడు. ఓ అపరిచిత వ్యక్తి బీర్ సీసాలను పగులగొట్టి గొడవకు దిగాడు. అనంతరం సుమారు ఆరుగురు అపరిచితులు కలిసి ఫిర్యాదుదారు, అతని స్నేహితులపై దాడి చేసినట్లు ఆరోపించారు. ఈ క్రమంలో పగిలిన బీర్ సీసా ముక్కలతో గాయాలు కాగా, ఫిర్యాదుదారుపై పగిలిన సీసాతో దాడి చేయడానికి కూడా యత్నించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.గాయపడిన వారిని పోలీసులు వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం బాధితుడి ఫిర్యాదు మేరకు లాలాగూడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

### 27నుంచి హైదరాబాద్ రేస్ క్లబ్‌లో మాన్సూన్ రేసులు ప్రారంభం : చైర్మన్ సురేందర్ రెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న చైర్మన్ సురేందర్ రెడ్డి తదితరులు

**మలక్ పేట, జులై 25, ప్రభాతవార్త:** మలక్ పేటలోని హైదరాబాద్ రేస్ క్లబ్ లో మాన్సూన్ రేసులు ఈనెల 27 నుంచి అక్టోబర్ 30వ తేదీ వరకు జరగనున్నట్లు రెస్ క్లబ్ చైర్మన్ ఆర్. సురేందర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి మలక్ పేటలోని హైదరాబాద్ రేస్ క్లబ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడ లేని విధంగా ఈ సీజన్ లో అత్యధికంగా రూ. 13 కోట్ల 63 లక్షల 35 వేల ప్రైజ్ మనీ ప్రకటించామని తెలిపారు. అదేవిధంగా రూ.17 లక్షల 85 విలువ గల ట్రోఫీలను ఇవ్వనున్నట్టు తెలిపారూ. కేంద్ర ప్రభుత్వం 2025 సెప్టెంబర్ 22వ తేదీ నుంచి 28 శాతం నుంచి 40శాతానికి జీఎస్టి పెంచడంతో రేస్ కోర్సులపై ఆర్థిక భారం పడుతుందని వివరించారు. జీఎస్టీ పెంచడంతో టోటలైజేటర్ల ద్వారా నమోదు అవుతున్న వ్యాపార లావాదేవీలు గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే తగ్గు ముఖం పడుతున్నాయని తెలిపారు. జీఎస్టీ రేట్లను తగ్గించాలని కోరారు. ప్రస్తుతం 619 గుర్రాలు ఉండగా 118 గుర్రాలు రెండేళ్ల వయసుగలవని పేర్కొన్నారు. ఈ సీజన్ లో ది కె. మహిపతిరావు మెమోరియల్ గోల్కొండ జువైనల్ మిలియన్, ది నిజాం గోల్డ్ కప్ (గ్రేడ్ 2), ది గవర్నర్ ట్రోఫీ, ది కోరమండల్ గ్రోమోర్ డెక్కన్ ఫిల్లిస్ ఛాంపియన్ షిప్ (గ్రేడ్ 3), ది వై. శంకర్రావు మమోరియల్ డెక్కన్ కోల్ట్స్ చాంపియన్ షిప్ (గ్రేడ్3), ది ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా గోల్డ్ కప్ (గ్రేడ్ 2), ది రేస్2 విన్. కామ్ డెక్కన్ డేర్బీ ( గ్రేడ్1),ది గోల్కొండ సెయింట్ లెగర్ (గ్రేడ్ 2) తదితర రేసులు ముఖ్యమైన రేసులని తెలిపారు.ఈసమావేశంలో క్లబ్‌సభ్యులు,సిబ్బందితదితరులు పాల్గొన్నారు

### సాయిబాబా పీఠాన్ని సందర్శించిన ఓఎస్‌డి వెంకట శేఖర్




ద్వారకామాయి సాయిబాబా పీఠంలో పూజలు చేసిన ఓఎస్‌డి వెంకట శేఖర్

**సరూర్‌నగర్, జులై 25 ప్రభాతవార్త:** విశేష ఆధ్యాత్మిక బోధనల ద్వారా సమాజంలోని మనుష్యుల్లో మంచి మార్పును తీసుకురావడానికి కృషి చేస్తున్న మీర్‌పేట్ ప్రశాంతిహిల్స్‌లోని ఆధ్యాత్మిక నిలయం శ్రీ ద్వారకామాయి సాయిబాబా పీఠాన్ని ఐటి శాఖ మంత్రి ఓఎస్‌డి (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ) వెంకట శేఖర్ సందర్శించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి అయిన ప్రథమ దత్తావతారమైన శ్రీపాద శ్రీవల్లభుల వంశంలో 34వ తరానికి చెందిన దత్త సిద్ధాంత ఆదికర్త పూజ్యశ్రీ గోపాలకృష్ణానంద స్వామీజీ కరకమలములచే బాబాకు పూజలు చేసిన తర్వాత వెంకట శేఖర్‌కు తీర్థ ప్రసాద వితరణ చేసి వేద ఆశీర్వచనం ఇచ్చి బాబా శేష వస్త్రంతో సన్మానించారు. అనంతరం స్వామీజీ అమూల్యమైన బోధనలు, పీఠం ఆధ్వర్యంలో మూగ జీవాల సేవ గురించి తెలుసుకున్న ఓఎస్‌డి హర్షం వ్యక్తం చేశారు.

### బడంగ్‌పేట్ సర్కిల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి పారిజాత పరామర్శ



అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న డోమినిక్‌ను పరామర్శిస్తున్న మాజీ మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, జులై 25 ప్రభాతవార్త:** తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, పాత బడంగ్‌పేట్ మున్సిపల్, పూర్వ నాదర్‌గుల్ గ్రామ పంచాయతీ ఉద్యోగి డోమినిక్‌ను బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పరామర్శించారు. దీర్ఘకాలంగా పని చేస్తూ అందరి మన్నలను అందుకున్న డోమినిక్ ప్రస్తుత అనారోగ్య పరిస్థితిని గమనించిన పారిజాత చలించిపోయారు. ఈ మేరకు తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆమె డోమినిక్ త్వరితగతిన కోలుకోవాలని కొంత ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యమ్రంలో నాదర్‌గుల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంగారి అశోక్, మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అంకంగారి వెంకటేశ్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి బాలాపూర్, మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభా కర్‌రెడ్డి, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నీరుడు శ్రీరాములు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియలో కాంగ్రెస్ నేతలు పాల్గొనాలి : ఎం.పరమేశ్వర్‌రెడ్డి



హబ్సిగూడలో సర్ ప్రక్రియలో పాల్గొన్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి, కంది శ్రవణ్ రెడ్డి తదితరులు

**ఉప్పల్, జులై 25 ప్రభాతవార్త :** సర్ ప్రక్రియలో ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం హబ్సిగూడ స్ట్రీట్ నంబర్ 8లోని గాంధీ గిరిజన బస్తీ కమాన్ వద్ద హబ్సిగూడ డివిజన్ అధ్యక్షుడు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సర్ హెల్ప్ డెస్క్‌ను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన ఈ హెల్ప్ డెస్క్ ను డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యం కల్పించిన ఓటు హక్కుని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. బీఎల్ఓలు, కాంగ్రెస్ బీఎల్ఏలు ఇంటింటికీ తిరిగి ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాలను నింపడంలో సహాయం చేయాలని, ఇప్పటికే నింపిన ఫారాలను కలెక్ట్ చేసుకోవాలని సూచించారు. హబ్సిగూడలో సర్ పురోగతిపై స్వయంగా బీఎల్ఓలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హబ్సిగూడ మాజీ డివిజన్ అధ్యక్షుడు గన్నారం విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ధర్మా నాయక్, సీనియర్ నాయకులు చింతల బాబు రావు, మురళీ కృష్ణ ముదిరాజ్, రాజు నాయక్, కిషన్ నాయక్, మాలు నాయక్, జావేద్, ధర్మ రాజు, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ వాసు నాయక్, సాయి కుమార్, సాయి కిరణ్, సుమన్ నాయక్, శివ, అనిల్ మామిడాల, శివ, స్వాతి, జ్యోతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.